TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-207 పేజీలు:-4 శుక్రవారం 10-07-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR | KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## 'ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు' ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్

1 మెల్‌బోర్న్‌లో భారతీయుల సభలో ప్రశంసలు

1 భారత్‌తో బంధం మరింత బలపడిందన్న వ్యాఖ్యలు

1 2023 అహ్మదాబాద్ పర్యటనను గుర్తు చేసిన ఆల్బనీస్

1 క్లిష్ట పరిస్థితుల్లో ముందు స్పందించేది భారతీయులేనని కితాబు

1 భారతీయుల వల్ల ఆస్ట్రేలియా బలమైన దేశంగా మారిందని వ్యాఖ్య



ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ మరోసారి ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీ ఆస్ట్రేలియాకు నిజమైన మిత్రుడని, తనకు ఎంతో ఆప్తుడని అన్నారు. మెల్‌బోర్న్‌లో జరిగిన 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో భారతీయులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన ఈ - మిగతా 2 లో


## అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలి

హెచ్-1బీ వీసా దుర్వినియోగంపై జేడీ వాన్స్ తీవ్ర హెచ్చరిక!

వీసా మోసాలకు పాల్పడుతున్న వారిపై కార్మికశాఖ దర్యాప్తు ప్రారంభించిందన్న వాన్స్

ప్రతిభ కలిగిన వారికోసం హెచ్-1బీ వీసాలను రూపొందించామని వెల్లడి

కొన్ని పెద్ద కంపెనీలు, కన్సల్టెన్సీలు వీటిని దుర్వినియోగం చేస్తున్నాయని మండిపాటు



హెచ్-1బీ వీసా దుర్వినియోగానికి పాల్పడుతూ, నిబంధనలను ఉల్లంఘిస్తున్న కంపెనీలు, వ్యక్తులపై అమెరికా ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఈ వ్యవహారంపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "అమెరికా ఉద్యోగాలు ప్రాథమికంగా అమెరికన్లకే దక్కాలి" అని ఆయన స్పష్టం చేశారు. వీసా మోసాలకు పాల్పడుతున్న వారిపై అమెరికా కార్మిక శాఖ ఇప్పటికే - మిగతా 2 లో

# క్రీడాకారుల కోసం స్పష్టమైన స్పోర్ట్స్ పాలసీ తెచ్చాం

8 క్రీడాకారుల కోసం స్పష్టమైన స్పోర్ట్స్ పాలసీ తీసుకువచ్చామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు

8 క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

8 అంతర్జాతీయ క్రీడల పతకాల పట్టికలో.. భారత్ అట్టడుగు స్థానంలో ఉంటోందని అన్నారు

8 పబ్లిక్ - ప్రైవేట్ భాగస్వామ్యంతో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పుకొచ్చారు



క్రీడాకారుల కోసం స్పష్టమైన స్పోర్ట్స్ పాలసీ తీసుకువచ్చామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొన్నారు. స్పోర్ట్స్ పాలసీ

## రాజకీయాలకు అతీతమైన బంధం



« తెలంగాణ మంత్రికి చంద్రబాబు, లోకేశ్ బర్త్‌డే విషెస్

« మంత్రి సీతక్కకు 'ఎక్స్' వేదికగా విషెస్ తెలియజేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

« చంద్రబాబును తన రాజకీయ గురువుగా భావిస్తానని పలుమార్లు చెప్పిన సీతక్క

« పార్టీలు, రాష్ట్రాలు వేరైనా వారి మధ్య కొనసాగుతున్న గౌరవప్రదమైన అనుబంధం

రాజకీయాల్లో కొన్ని బంధాలు పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా నిలుస్తాయి. అలాంటి - మిగతా 2 లో

## బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి



V బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న నిధులు స్వచ్ఛమైనవి కావన్న కవిత

V ఆ డబ్బులు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చాయని ఆరోపణ

V ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలో చేరనని వ్యాఖ్య

బీఆర్ఎస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలో - మిగతా 2 లో

## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ ఆందోళన



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు.. ఆస్ట్రేలియాలో స్పందించిన ప్రధాని మోదీ


అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ మొదలైన సైనిక దాడులు

చర్చలు, దౌత్యంతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్న మోదీ

పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు చోటుచేసుకున్న నేపథ్యంలో,సమస్యల - మిగతా 2 లో

## ఉగ్రవాద దేశాల జాబితా నుంచి సిరియా అవుట్

డొనాల్డ్ ట్రంప్ చారిత్రాత్మక నిర్ణయం!



« సిరియాను ఉగ్రవాద స్పాన్సర్ దేశాల జాబితా నుండి తొలగించాలని అమెరికా నిర్ణయం

« కాంగ్రెస్‌కు అధికారికంగా సమాచారం అందించిన విదేశాంగ మంత్రి మార్కో రూబియో

« 45 రోజుల సమీక్షా గడువు తర్వాత పూర్తిగా తొలగిపోనున్న ఆంక్షలు

« సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షరాకు లేఖ రాసిన డొనాల్డ్ ట్రంప్

« అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులతో సిరియా ఆర్థిక వ్యవస్థ పుంజుకునే అవకాశం

సిరియాను ఉగ్రవాదానికి మద్దతునిచ్చే దేశాల (స్టేట్ స్పాన్సర్ ఆఫ్ టెర్రరిజం) జాబితా నుండి తొలగించాలని- మిగతా 2 లో

# చైనాలో ఘోర అగ్నిప్రమాదం

## షూ ఫ్యాక్టరీలో 28 మంది సజీవ దహనం

8 చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో ఘోర అగ్నిప్రమాదం

8 షూ ఫ్యాక్టరీలో చెలరేగిన మంటల్లో 28 మంది కార్మికులు మృతి

8 మంటల్లో మరికొందరు చిక్కుకున్నట్లు అనుమానం

8 ఘటనపై విచారణకు ఆదేశించిన అధ్యక్షుడు జీ జిన్‌పింగ్



చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఆగ్నేయ చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో గల ఒక షూ ఫ్యాక్టరీలో గురువారం భారీ మంటలు చెలరేగడంతో 28 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

## కియా ఈవీ హబ్, విశాఖలో ఎక్స్‌పోర్ట్ సెంటర్

కొరియాలో మంత్రి లోకేశ్ కీలక భేటీలు



« ఏపీలో ఈవీ, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని విస్తరించాలని కియాకు లోకేశ్ ప్రతిపాదన

« విశాఖ పోర్టు సమీపంలో ఎక్స్‌పోర్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

« కొరియన్ పెట్టుబడిదారులకు 3ూ విధానంతో రక్షణ కవచంలా ఉంటామని భరోసా

« ఏపీలో కొరియన్ కల్చరల్ సెంటర్, జాయింట్ ట్రైయినింగ్ అకాడమీల ఏర్పాటుకు సంసిద్ధత

ఏపీకి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ - మిగతా 2 లో

# సీఎం చంద్రబాబు సమక్షంలో 2,074 ఎకరాల తొలగింపు ప్రక్రియ

8 గుటుపల్లె భూముల వివాదం స్వయంగా తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లిన సీఎం చంద్రబాబు

8 బేతంచెర్ల మండలంలో 22ఏ జాబితాలోని భూములకు విముక్తి

8 గత ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిన భూములపై నిర్ణయం

8 వేల ఎకరాల వక్ఫ్, చుక్కల భూముల సమస్యలకు కూడా పరిష్కారం

8 సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులైన రైతులు



నంద్యాల జిల్లాలోని బేతంచెర్ల రైతులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు శాశ్వత పరిష్కారం చూపారు. గత ప్రభుత్వం 22ఏ నిషేధిత జాబితాలో పెట్టిన వేలాది ఎకరాల భూములకు విముక్తి కల్పించారు.

## ధాన్యం కొనుగోలులో రికార్డు సృష్టించాం



£ రైతులు, రైస్ మిల్లర్లతో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సెమినార్

£ రెండో ఏడాది 74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్న మనోహర్

£ 95 శాతం చెల్లింపులను 24 గంటల్లో పూర్తి చేశామన్న మంత్రి

కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తి కావడంతో- మిగతా 2 లో

## సీఎం చంద్రబాబు సమక్షంలో 2,074 ఎకరాల తొలగింపు ప్రక్రియ

– మొదటి పేజీ తరువాయి ఈ సమస్యను పరిష్కరించేందుకు స్వయంగా బనగానపల్లె తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లిన సీఎం, తన సమక్షంలోనే అధికారిక ప్రక్రియను పూర్తి చేయించారు. బేతంచెర్ల మండలం గుటుపల్లె గ్రామంలోని సర్వే నెం. 215లో ఉన్న 2,669 ఎకరాల సర్వీసు ఇనాం భూములను గత ప్రభుత్వం 1908 నాటి చట్టాన్ని కారణంగా చూపి 22ఏ జాబితాలో చేర్చింది. దీంతో రైతులు తమ భూములపై హక్కులు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది మార్చిలో తమ గోడును ముఖ్యమంత్రికి విన్నవించుకున్నారు. వారి వినతిపై స్పందించిన ప్రభుత్వం, 2,074 ఎకరాల పట్టాభూమిని 22ఏ(1)(సి) జాబితా నుంచి తొలగించాలని నిర్ణయించింది. గురువారం బనగానపల్లె తహసిల్దార్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమక్షంలో జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్‌లు ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్ ద్వారా ఈ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఈ ప్రక్రియను అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో, 2023లో జాబితాలో చేర్చిన 426 ఎకరాల వక్ఫ్ భూములను కూడా తొలగించడంతో 897 మంది రైతులకు లబ్ధి చేకూరింది. వీటితో పాటు బనగానపల్లె నియోజకవర్గంలో 23 మంది రైతులకు చెందిన 101 ఎకరాల చుక్కల భూములను కూడా క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అనంతరం సీఎం చంద్రబాబు స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో లబ్ధిదారులైన రైతులతో మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు వారి భూములను తిరిగి అప్పగించామని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రికి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ. 1,400 కోట్లపై విచారణ జరిపించాలి

– మొదటి పేజీ తరువాయి ఉన్న రూ. 1,400 కోట్ల నిధులు స్వచ్ఛమైనవి కావని అన్నారు. అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవేనని ఆరోపించారు. ఆ నిధులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, ఆ డబ్బును తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు పంచాలి అని డిమాండ్ చేశారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ పార్టీలో చేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా చేపట్టిన 'సింగరేణి బాయి బాట' కార్యక్రమంలో భాగంగా తాను క్షేత్రస్థాయిలో కార్మికులతో మమేకమవుతున్నట్లు కవిత తెలిపారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలు, చెల్లించాల్సిన బకాయిల కారణంగా సింగరేణి సంస్థపై పెను భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థ ఎంతటి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందంటే... కనీసం కార్మికులకు అవసరమైన పనిముట్లు (మైనింగ్ పరికరాలు) కూడా కొనలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. "ఇక్కడ అధికారులకు ఓ రూల్... రాత్రింబవళ్లు కష్టపడే కార్మికులకు మరో రూల్‌లా యాజమాన్యం వ్యవహరిస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు. తెలంగాణ రాకముందు సింగరేణిలో 62 వేల మంది రెగ్యులర్ కార్మికులు ఉండగా, నేడు ఆ సంఖ్య 38 వేలకు పడిపోయిందని గుర్తుచేశారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. "కార్మికుల వారసత్వ (డిపెండెంట్) ఉద్యోగాల కోసం నెలలో కనీసం రెండు సార్లు మెడికల్ బోర్డ్ నిర్వహించాలి. ఒకవేళ ప్రభుత్వం, యాజమాన్యం డిపెండెంట్ ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వకపోతే.. ఈనెల 20 నుంచి రామగుండం వేదికగా నిరవధిక దీక్ష చేపడతాం" అని స్పష్టం చేశారు.


## రాజకీయాలకు అతీతమైన బంధం

– మొదటి పేజీ తరువాయి గౌరవప్రదమైన అనుబంధం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ మంత్రి సీతక్కల మధ్య కొనసాగుతోంది. తెలుగుదేశం పార్టీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సీతక్క (ధనసరి అనసూయ) పుట్టినరోజు సందర్భంగా చంద్రబాబు, ఆయన కుమారుడు, ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. నేడు మంత్రి సీతక్క పుట్టినరోజు సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) గారికి జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాసేవలో మీరు మరిన్ని విజయాలు సాధిస్తూ, ఆయురారోగ్యాలతో ఉండాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను" అని తన సందేశంలో పేర్కొన్నారు. మరోవైపు ఏపీ మంత్రి నారా లోకేశ్ కూడా సీతక్కకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెను అణగారిన వర్గాల గొంతుకగా అభివర్ణిస్తూ, ఆమె జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. "తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖల మంత్రి శ్రీమతి ధనసరి సీతక్క గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాసంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న సీతక్క గారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని లోకేశ్ ట్వీట్ చేశారు. తెలుగుదేశం పార్టీయే తనకు రాజకీయ జన్మనిచ్చిందని, చంద్రబాబే తన రాజకీయ గురువు అని సీతక్క పలు సందర్భాల్లో బహిరంగంగానే చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటికీ, చంద్రబాబుతో తనకున్న గౌరవ సంబంధాలు ఎప్పటికీ కొనసాగుతాయని ఆమె స్పష్టం చేశారు. ఏటా రాఖీ పౌర్ణమికి చంద్రబాబును కలిసి రాఖీ కట్టడం ద్వారా ఆమె తన అభిమానాన్ని చాటుకుంటారు. ఈ బంధంపై ఎవరు ఏమనుకున్నా తాను పట్టించుకోనని గతంలో ఆమె వ్యాఖ్యానించారు. పార్టీలు వేరైనా, రాష్ట్రాలు భిన్నమైనా వారి మధ్య ఉన్న ఈ గురుశిష్య అనుబంధం తెలుగు రాజకీయాల్లో ఒక ప్రత్యేకతగా నిలుస్తోంది.

## 'ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు'.. ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్

– మొదటి పేజీ తరువాయి వ్యాఖ్యలు చేశారు. మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భారతీయులు హాజరయ్యారు. ఎన్నో చారిత్రక కార్యక్రమాలకు ఈ స్టేడియం వేదికగా నిలిచిందని, కానీ భారతీయుల ఈ సమావేశం అత్యంత ప్రత్యేకమైందని ఆల్బనీస్ అన్నారు. ఈ సభలో కనిపిస్తున్న ఉత్సాహమే భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న బలమైన బంధానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానిగా తాను రెండుసార్లు భారత్‌లో పర్యటించే అవకాశం దక్కిందని ఆల్బనీస్ గుర్తు చేసుకున్నారు. భారతదేశ అందాలు, ప్రజల ఆతిథ్యం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. 2023లో అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మోదీతో కలిసి రథంలో ప్రయాణించిన అనుభవాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. అప్పట్లో గుజరాత్‌లో చూసిన ఆప్యాయత, ఇప్పుడు ఈ సభలోనూ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. భారత సంతతి ప్రజలు ఆస్ట్రేలియా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆల్బనీస్ కొనియాడారు. ఆరోగ్యం, ఐటీ వంటి రంగాల్లో తమ సేవలు అందిస్తున్నారని చెప్పారు. చిన్న వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు విద్యా రంగాన్ని కూడా బలోపేతం చేస్తున్నారని తెలిపారు. క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ముందుగా స్పందించి సాయం చేసేది భారతీయులేనని వెల్లడించారు. భారతీయుల వల్ల ఆస్ట్రేలియా మరింత బలమైన, వైవిధ్యభరితమైన దేశంగా మారిందని ఆల్బనీస్ అన్నారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య బంధాన్ని మరింత బలపరిచే సజీవ వారధి భారత సంతతి ప్రజలేనని కొనియాడారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ ఆందోళన



– మొదటి పేజీ తరువాయి పరిష్కారానికి చర్చలు, దౌత్యమే ఏకైక మార్గమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన, గురువారం మెల్‌బోర్న్‌లో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు పాల్పడటంతో, అమెరికా ప్రతిగా సైనిక చర్యలు చేపట్టింది. ఇరాన్‌కు చెందిన బుషెహర్, చాబహార్ సహా పలు తీర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలపై దాడులు జరిపినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ దాడులతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. ఈ పరిణామాలపై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన మోదీ, "ప్రపంచంలో కొనసాగుతున్న ఏ వివాదానికైనా చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం సాధ్యమవుతుంది" అని స్పష్టం చేశారు. పౌరుల భద్రతను కాపాడాలని, వాణిజ్య కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని ఇరు దేశాల నేతలు సంయుక్త ప్రకటనలో కోరారు. పశ్చిమాసియాలో తలెత్తిన ఈ తాజా ఘర్షణలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు, వాణిజ్య మార్గాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత్ వంటి దేశాలకు చమురు సరఫరా, ఇంధన భద్రతకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే భారత్ తన ప్రయోజనాలను, ప్రవాస భారతీయుల భద్రతను దృష్టిలో ఉంచుకుని దౌత్యపరమైన పరిష్కారాన్ని ఆకాంక్షిస్తోంది.

# కియా ఈవీ హబ్, విశాఖలో ఎక్స్‌పోర్ట్ సెంటర్

– మొదటి పేజీ తరువాయిశాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సియోల్‌లో ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం కియా మోటార్స్‌తో పాటు దక్షిణ కొరియా ప్రభుత్వ ఉన్నతాధికారులతో కీలక సమావేశాలు నిర్వహించారు. ఏపీని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చేందుకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు వ్యూహాత్మక ప్రతిపాదనలను వారి ముందు ఉంచారు.

**కియాతో ఉన్నత స్థాయి సమావేశం.. భారీ విస్తరణకు ఆహ్వానం**

సియోల్‌లో కియా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) టే హన్ లీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందంతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా, అనంతపురంలో ఇప్పటికే విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న కియా, రాష్ట్రంలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ముఖ్యంగా ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ), హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోకేశ్ ప్రతిపాదించారు. కియా ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్న ప్లాట్‌ఫామ్ బియాండ్ వెహికల్ (పీబీవీ) వాహనాల ఉత్పత్తిని కూడా ఏపీలో చేపట్టాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్లకు సులభంగా ఎగుమతులు చేసేందుకు వీలుగా విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ (కంప్లీట్లీ నాక్డ్ డౌన్) అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. దీనితో పాటు, ఈ-జీఎంపీ ప్లాట్‌ఫామ్ కాంపోనెంట్లు, బ్యాటరీ సిస్టమ్‌లు, ఈవీ ఛార్జింగ్ ఎలక్ట్రానిక్స్ కోసం ఒక ఈవీ-కాంపోనెంట్ల తయారీ కేంద్రాన్ని, పవర్‌ట్రెయిన్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్ కోసం ఒక ఈవీ పవర్‌ట్రెయిన్ టెస్టింగ్ కేంద్రాన్ని కూడా స్థాపించాలని కోరారు. మంత్రి లోకేశ్ ప్రతిపాదనలపై కియా ప్రతినిధి టే హన్ లీ సానుకూలంగా స్పందించారు. 2017లో అనంతపురంలో అడుగుపెట్టి, 2019 నాటికి భారీ ఉత్పత్తి ప్రారంభించిన తీరును గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం తమ సంస్థ ఈవీ, అటానమస్ మొబిలిటీపై దృష్టి సారించిందని, లోకేశ్ చేసిన తాజా ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**కొరియన్ పెట్టుబడిదారులకు 3హా భరోసా**

అనంతరం మంత్రి లోకేశ్, దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్-హే సిసిలియా చుంగ్‌తో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న 3హా (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో, తూర్పు తీరంలో సురక్షితమైన, నమ్మకమైన ప్రత్యామ్నాయంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని, దీనివల్ల అంతర్జాతీయ సరఫరా శృంఖల (సప్లయ్ చైన్) నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పన్ను రాయితీలు, తక్కువ ధరకే భూమి, సబ్సిడీలు పరిశ్రమలకు అండగా నిలుస్తాయని తెలిపారు.

**నైపుణ్యాభివృద్ధి, సాంస్కృతిక బంధానికి పెద్దపీట**

కొరియన్ సంస్థలు ఏపీకి రావడానికి ముందే, అక్కడి పని ప్రమాణాలు, భాష, సంస్కృతిపై స్థానిక యువతకు అవగాహన కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని లోకేశ్ తెలిపారు. దీనికోసం దక్షిణ కొరియాతో కలిసి సంయుక్త శిక్షణా అకాడమీలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖలు సంసిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక బంధాన్ని బలోపేతం చేసేందుకు ఏపీలో ఒక కొరియన్ కల్చరల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. భారత్‌లోనే రెండో అతి పొడవైన తీరప్రాంతం, విశాఖపట్నం, కృష్ణపట్నం వంటి ప్రధాన ఓడరేవులు, కొత్తగా రాబోయే నాలుగు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల వల్ల ఏపీ తక్కువ ఖర్చుతో ఎగుమతులకు లాంచ్‌ప్యాడ్‌గా మారుతుందని లోకేశ్ వివరించారు. భారత్-కొరియా వ్యూహాత్మక భాగస్వామ్యానికి అనుబంధంగా ఒక ప్రత్యేకమైన 'ఆంధ్రప్రదేశ్-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్' ఏర్పాటు చేయాలని, ఇరు ప్రాంతాల మధ్య వార్షిక ఆర్థిక భాగస్వామ్య చర్చలకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. వాణిజ్య సంబంధాలను మరింత పటిష్ఠం చేయడానికి విశాఖపట్నం-బుసాన్/ఇంచియాన్ నగరాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం, ఏపీలోని యూనివర్సిటీల్లో కొరియన్ భాషా కేంద్రాలు, డైరెక్ట్ ఎయిర్ కనెక్టివిటీకి చొరవ చూపాలని కోరారు.

# క్రీడాకారుల కోసం స్పష్టమైన స్పోర్ట్స్ పాలసీ తెచ్చాం

– మొదటి పేజీ తరువాయి తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దేశానికి అకాడమీలు, వసతులు అవసరమని తెలిపారు. ఈరోజు గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను సీఎం ప్రారంభించారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీని ప్రారంభించారు. స్పోర్ట్స్ వర్సిటీ వెబ్‌సైట్, లోగో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు, ఎంపీ పీటీ ఉష పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

**క్రీడల్లో భారత్ వెనుకబడి ఉంది..**

క్రీడల్లో భారత్ వెనుకబడి ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ క్రీడల పతకాల పట్టికలో.. భారత్ అట్టడుగు స్థానంలో ఉంటోందని అన్నారు. క్రీడాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని సూచించారు. పబ్లిక్ – ప్రైవేట్ భాగస్వామ్యంతో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పుకొచ్చారు. దేశం గర్వించే క్రీడాకారులు, వ్యాపారవేత్తలను భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. ఏ రంగంలోనైనా కష్టపడేవారు తప్పకుండా రాణిస్తారని అన్నారు. క్రీడలపై యువత దృష్టి సారించాలని సూచించారు. యువతే ఈ దేశ సంపద అని వ్యాఖ్యానించారు.

**పీటీ ఉష దేశానికి పేరు తెచ్చారు..**

ఒలింపిక్స్‌లో ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్ అత్యంత వెనుకపడిందని సీఎం తెలిపారు. ప్రభుత్వాలకు ఒక విధానం లేకపోవడమే ఇందుకు కారణమని చెప్పుకొచ్చారు. అప్పుడప్పుడు పీటీ ఉష లాంటి క్రీడాకారులు క్రీడల్లో దేశానికి పేరు తీసుకువచ్చారని ప్రశంసించారు. క్రీడల్లో రాణించడం వల్లే పీటీ ఉషకు గుర్తింపు వచ్చిందని కొనియాడారు. క్రీడల్లో రాణించి ఆమె రాజ్యసభ సభ్యురాలి స్థాయికి చేరారని ప్రశంసించారు. ప్రపంచ దేశాల్లో భారత్‌ను క్రీడల్లో రాణించిన దేశంగా గుర్తించడం లేదని అన్నారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక పాలసీని తీసుకొచ్చిందని వివరించారు.

**లక్ష్యాన్ని చేరాలంటే వందశాతం కష్టపడాల్సిందే..**

స్పోర్ట్స్ యూనివర్సిటీని పబ్లిక్ ప్రైవేట్ విధానంలో ప్రారంభించామని సీఎం వెల్లడించారు. లక్ష్యాన్ని చేరాలంటే వందశాతం కష్టపడాల్సిందేనని సూచించారు. రాబోయే రోజుల్లో ఒలింపిక్స్‌కు వేదికగా తెలంగాణను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పుకొచ్చారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాలతో పాటు నగదు పారితోషికం ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 2028 నాటికి తెలంగాణ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభిస్తామని వివరించారు. క్రీడల్లో రాణిస్తే మీ భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. క్రీడల్లో రాణించి దేశానికి పేరు తీసుకువస్తే మీకు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలి

– మొదటి పేజీ తరువాయి విస్తృతస్థాయిలో దర్యాప్తు ప్రారంభించిందని, విచారణ నిమిత్తం పలువురికి నోటీసులు కూడా జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా అత్యున్నత ప్రతిభ కలిగిన శాస్త్రవేత్తలు, వైద్యులు, ఐటీ వంటి రంగాలకు చెందిన సాంకేతిక నిపుణులు అమెరికాకు వచ్చి సేవలందించేందుకు వీలుగా హెచ్-1బీ వీసాను రూపొందించామని... కానీ కొన్ని పెద్ద కంపెనీలు, కన్సల్టెన్సీలు ఈ విధానాన్ని పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నాయని వాన్స్ మండిపడ్డారు. విదేశాల నుంచి తక్కువ వేతనాలకే ఉద్యోగులను తెచ్చుకుంటూ... అమెరికాలోని స్థానిక కార్మికుల ఉపాధి అవకాశాలను కొన్ని కంపెనీలు దెబ్బతీస్తున్నాయని ఆయన విమర్శించారు. పన్ను చెల్లింపుదారుల సొమ్మును కాపాడటంతో పాటు వీసా మోసాలను అరికట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వాన్స్ చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించే వారిని ఇకపై ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారికి అమెరికాలోకి ప్రవేశం కూడా ఉండదని హెచ్చరించారు. అమెరికా కార్మిక శాఖ చేపట్టిన ఈ ఆకస్మిక దర్యాప్తులతో, ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులు, అక్కడ పనిచేస్తున్న కన్సల్టెన్సీల్లో ప్రస్తుతం తీవ్ర కలకలం రేగుతోంది.

## ధాన్యం కొనుగోలులో రికార్డు సృష్టించాం

– మొదటి పేజీ తరువాయి విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలు తెచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో ఏకంగా 74 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించి రికార్డు సృష్టించిందన్నారు. రూ. 31 వేల కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులను 24 గంటల్లోనే పూర్తి చేశామని తెలిపారు. ఏపీ తెచ్చిన '10 శాతం బ్రోకెన్ రైస్' విధానాన్ని కేంద్రం కూడా గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయనుందని చెప్పారు. క్యూఆర్ కోడ్, వాట్సాప్ బుకింగ్, మాయిశ్చర్ మీటర్ల ద్వారా కొనుగోళ్లలో పారదర్శకత పెంచామని, రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేలా రైతులను సన్నద్ధం చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

# ఉగ్రవాద దేశాల జాబితా నుంచి సిరియా అవుట్

– మొదటి పేజీ తరువాయి తమ ప్రభుత్వం నిర్ణయించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాంగ్రెస్‌కు తెలియజేశారు. డమాస్కస్‌తో సంబంధాలను సాధారణీకరించడానికి, యుద్ధంతో నలిగిపోయిన ఆ దేశ ఆర్థిక పునరుద్ధరణకు మద్దతు ఇవ్వడానికి వాషింగ్టన్ తీసుకున్న అత్యంత కీలకమైన అడుగు ఇది. ఈ నిర్ణయానికి సంబంధించిన 45 రోజుల ముందస్తు నోటీసు వ్యవధిని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అధికారికంగా కాంగ్రెస్‌కు సమర్పించారు. సిరియా ప్రజలు ఉన్నత స్థానానికి ఎదగడానికి డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న మరొక చారిత్రాత్మక నిర్ణయం ఇదని రూబియో కొనియాడారు. ఈ నిర్ణయం గురించి డొనాల్డ్ ట్రంప్ స్వయంగా సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షరాకు ఒక లేఖ ద్వారా తెలియజేశారు. బుధవారం అంకారాలో నాటో సదస్సు సందర్భంగా వీరిద్దరూ సమావేశమైన తర్వాత ఈ లేఖను అందించినట్లు అమెరికా ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. "మీ దేశ పునర్నిర్మాణానికి అడ్డుగా ఉన్న అన్ని అడ్డంకులను తొలగిస్తానని నేను మాట ఇచ్చాను.. చాలా త్వరగా మీరు ఆ పని చేయగలుగుతారు. సిరియాలో పెట్టుబడులు పెట్టడానికి, మీ దేశాన్ని మరింత సంపన్నంగా మార్చడానికి అమెరికా కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి" అని ట్రంప్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఉగ్రవాద స్పాన్సర్ దేశంగా ఉన్న ముద్ర తొలగిపోతే.. సిరియాపై ఉన్న విదేశీ సహాయ నిరోధాలు, రక్షణ రంగ ఎగుమతులపై ఆంక్షలు, ఆర్థిక లావాదేవీల ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయి. ఈ నిర్ణయాన్ని సిరియా సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ సఫ్వాత్ రస్లాన్ స్వాగతించారు. దీనివల్ల అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సిరియా మళ్లీ భాగస్వామి అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతేడాదే సిరియాపై ఉన్న కొన్ని ఆంక్షలను ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా తొలగించారు. ఇప్పుడు సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాలు కూడా సిరియాలో వందల కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. మాజీ అధ్యక్షుడు బషర్ అల్-అస్సాద్‌ను 2024 చివరలో గద్దె దించి సిరియా పగ్గాలు చేపట్టిన ప్రస్తుత అధ్యక్షుడు అహ్మద్ అల్-షరాను డొనాల్డ్ ట్రంప్ అభినందించారు. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద ముఠాపై అల్-షరా తీసుకుంటున్న చర్యలను ట్రంప్ సమర్థిస్తూ.. "అతన్ని నాతో పాటు అందరూ గౌరవిస్తారు" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ 45 రోజుల సమీక్ష పూర్తి చేసిన తర్వాత ఈ నిర్ణయం అధికారికంగా అమలులోకి రానుంది.

# చైనాలో ఘోర అగ్నిప్రమాదం

– మొదటి పేజీ తరువాయి భవనంలో మరికొందరు చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. షూ రాజధానిగా పిలిచే జిన్‌జియాంగ్ నగరంలోని హుయిటెంగ్ షూస్ ఫ్యాక్టరీలో ఈ విషాదం చోటుచేసుకుంది. బహుళ అంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగలు అలుముకున్నాయి. భవనం పైకప్పుపై చిక్కుకున్న కొందరు కార్మికులు ప్రాణరక్షణ కోసం ఆర్తనాదాలు చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సుమారు 200 మంది అగ్నిమాపక సిబ్బంది 35 అగ్నిమాపక యంత్రాలతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షూ తయారీలో వినియోగించే మండే స్వభావం కలిగిన ముడి పదార్థాల వల్లే మంటలు వేగంగా వ్యాపించినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ దుర్ఘటనపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదొక భారీ ప్రాణ నష్టమని ఆవేదన వ్యక్తం చేస్తూ, సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## నీటి వాటా కోసం ఎంతకైనా తెగిస్తాం: భారత్‌కు పాక్ సైన్యం వార్నింగ్!

– మొదటి పేజీ తరువాయిసంబంధాలను మరింత జటిలం చేస్తోంది. పాక్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అధ్యక్షతన జరిగిన 276వ కోర్ కమాండర్ల ఉన్నత స్థాయి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ ప్రభుత్వ ఆదేశాలకు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సింధు జలాల్లో తమ హక్కును కాపాడుకోవడానికి కట్టుబడి ఉన్నామని సైన్యం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం లేదా మళ్లించడాన్ని 'యుద్ధ చర్య'గా పరిగణిస్తామని గత ఏడాది ఏప్రిల్ 24న పాక్ జాతీయ భద్రతా కమిటీ (ఎన్ఎస్‌సీ) చేసిన తీర్మానాన్ని ఈ సమావేశంలో పునరుద్ఘాటించారు. దేశ సన్నద్ధత, వృత్తి నైపుణ్యం పట్ల సమావేశం సంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) చైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ కూడా భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సింధు నది జలాలను భారత్ ఒక 'ఆయుధం'గా మార్చుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నీటి హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, అవసరమైతే భారత్‌తో యుద్ధం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. సైనిక సమావేశంలో ఆఫ్ఘన్ గడ్డపై నుంచి పాక్‌లో జరుగుతున్న ఉగ్రదాడులపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. కశ్మీరీలకు తమ నైతిక, రాజకీయ మద్దతు కొనసాగుతుందని పునరుద్ఘాటించారు. గత ఏడాది పహల్గాంలో 26 మంది మృతికి కారణమైన భీకర ఉగ్రదాడి తర్వాత, దానికి ప్రతీకార చర్యగా 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్థాన్ శాశ్వతంగా, విశ్వసనీయంగా స్వస్తి పలికేంత వరకు ఈ ఒప్పందంపై ముందుకు వెళ్లేది లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. క్షేత్రస్థాయి వాస్తవాలకు విరుద్ధంగా ఒప్పందాలు ఒంటరిగా మనుగడ సాగించలేవని భారత్ స్పష్టం చేసింది. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960లో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం, తూర్పు నదులైన రావి, సట్లెజ్, బియాస్‌పై భారత్‌కు, పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్‌పై పాకిస్థాన్‌కు నియంత్రణ ఉంటుంది. ఒప్పందం నిలిచిపోవడంతో, రుతుపవనాల సమయంలో పాక్‌తో వరద సమాచారాన్ని పంచుకోవాల్సిన బాధ్యత భారత్‌కు లేకుండా పోయింది. ఇదే సమయంలో భారత్.. సింధు నదీ బేసిన్‌లో సావల్‌కోట్, రాటిల్, బుర్సార్ వంటి పలు జలవిద్యుత్ ప్రాజెక్టులను వేగవంతం చేస్తోంది. పాకిస్థాన్ వ్యవసాయంలో 80-90 శాతం సింధు నదీ వ్యవస్థపైనే ఆధారపడి ఉంది. ఆ దేశంలోని ప్రధాన జలాశయాలైన టార్బేలా, మంగ్లా డ్యామ్‌లలో నీటి నిల్వలు అడుగంటినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఒకప్పుడు సాంకేతిక ఒప్పందంగా ఉన్న సింధు జలాల అంశం ఇప్పుడు ఇరు దేశాల మధ్య కీలకమైన వ్యూహాత్మక ఒత్తిడి కేంద్రంగా మారింది.

# మధ్యతరగతి వారికి బెస్ట్ ఆప్షన్.. కేవలం రూ.3.49 లక్షలకే అద్భుతమైన మైలేజీ ఇచ్చే మారుతి కారు..!





తక్కువ ధరల విభాగంలో మారుతి సుజుకి భారత మార్కెట్లో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. ఈ కారు మార్కెట్లో బాగా రాణిస్తోంది. ఈ బడ్జెట్ ధర కారులో అనేక గొప్ప ఫీచర్లు ఉన్నాయి. మధ్యతరగతి ప్రజలు ఈ కారును ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు.. భారతీయ కార్ల మార్కెట్‌లో చవకైన ధరలో మంచి మైలేజీనిచ్చే కార్లకు ఎప్పుడూ అధిక డిమాండ్ ఉంటుంది. ఇప్పుడు రూ.5 లక్షల లోపు ధర ఉన్న కార్ల జాబితాలో మారుతి సుజుకి ఎస్-ప్రెస్సో మరోసారి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. దాని తక్కువ ధర, మంచి మైలేజీ, నగర డ్రైవింగ్‌కు అనువైన డిజైన్, ఆప్షన్ కారణంగా ఇది మధ్యతరగతి కుటుంబాలకు ఇష్టమైన కారుగా నిలిచింది. ప్రస్తుతం భారతదేశంలో అమ్మకానికి ఉన్న అత్యంత చౌకైన కార్లలో ఒకటైన ఎస్-ప్రెస్సో. సుమారు రూ.3.49 లక్షల ప్రారంభ ఎక్స్-షోరూమ్ ధరతో మొదలవుతుంది. అందువల్ల తక్కువ బడ్జెట్‌లో కొత్త కారు కొనాలనుకునే వారికి ఇది ఒక ఆకర్షణీయమైన ఎంపికగా నిలుస్తుంది. ఇందులో కాస్త ఎక్కువ ధరతో ఇతర మోడళ్లు కూడా ఉన్నాయి. కానీ ఇది ఇంత తక్కువ ప్రారంభ ధరతో ఉండటంతో మధ్య తరగతి వారికి బెస్ట్ ఆప్షన్ అనే చెప్పాలి. ఈ కారులో ఖ10జ 1.0-లీటర్ పెట్రోల్ ఇంజన్‌ను అమర్చారు. ఇది 63 ఎప్త్రజూ శక్తిని, 89 చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనికి 5-స్పీడ్ గేర్‌బాక్స్‌ను జత చేశారు. పట్టణ ప్రాంతాల్లో రోజువారీ ప్రయాణానికి ఇది మంచి పనితీరును అందిస్తుందని వాహన నిపుణులు చెబుతున్నారు. మారుతి సుజుకి ఈ కారుకు ఫ్యాక్టరీ-ఫిట్ ఆప్షన్‌ను కూడా అందిస్తోంది. దీనివల్ల ఇంధన ఖర్చులు తగ్గడమే కాకుండా మెరుగైన మైలేజీ కూడా లభిస్తుంది. పెట్రోల్ ధరలు పెరుగుతుండటంతో కార్లకు డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. లీటర్ పెట్రోల్‌కు సుమారు 25.కిమీ వరకు మైలేజీ ఇస్తుండగా, సీఎన్‌జీ ఆప్షన్‌తో ఇంకా ఎక్కువ మైలేజీ ఇస్తుంది. ఎస్-ప్రెస్సో మరో ప్రత్యేకత దాని కాంపాక్ట్ ఎస్‌యూవీ-శైలి డిజైన్. చిన్న కుటుంబాలకు, మొదటిసారి కారు కొనుగోలు చేసేవారికి ఇది ఒక మంచి ఎంపిక అని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. భద్రతా ఫీచర్లు, టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్, డిజిటల్ డిస్‌ప్లే కూడా వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తక్కువ ధరల విభాగంలో మారుతి సుజుకి భారత మార్కెట్లో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. ఎస్-ప్రెస్సో కూడా బాగా రాణిస్తోంది. ఈ బడ్జెట్ ధర కారులో అనేక గొప్ప ఫీచర్లు ఉన్నాయి. మధ్యతరగతి ప్రజలు ఈ కారును ఎంతో ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు.

# మీరు నెలకు రూ.10,000 సిప్ చేస్తే రూ.2 కోట్లు అయ్యేందుకు ఎన్నేళ్లు పడుతుంది?




పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టే ముందు తమ ఆదాయం, రిస్క్‌ను తట్టుకోగల సామర్థ్యం, ఆర్థిక లక్ష్యాలను పరిగణనలోకి తీసుకోవాలి. మ్యూచువల్ ఫండ్‌లు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. అందుకే పెట్టుబడి పెట్టే ముందు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. అలాగే.. ఇటీవలి కాలంలో మధ్యతరగతి ప్రజలలో మ్యూచువల్ ఫండ్ సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ పెట్టుబడులు బాగా ప్రాచుర్యం పొందాయి. తక్కువ మొత్తంతో దీర్ఘకాలంలో భారీ సంపదను నిర్మించుకోవచ్చనే కారణంతో యువత పట్ల ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. మీరు నెలకు రూ.10,000 పెట్టుబడి పెడితే రూ.2 కోట్ల ఫండ్‌ను నిర్మించడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో తెలుసుకుందాం.. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం.. పెట్టుబడిలో సమయం, క్రమశిక్షణ అనేవి అత్యంత ముఖ్యమైన అంశాలు. ఉదాహరణకు మీరు నెలకు రూ.10,000 పెట్టుబడి పెట్టి, సగటున 12% వార్షిక రాబడిని పొందితే సుమారు 30 సంవత్సరాల తర్వాత మీరు రూ.2 కోట్లకు పైగా కూడబెట్టవచ్చు. దీర్ఘకాలంలో చక్రవడ్డీ ప్రభావం వల్ల పెట్టుబడి మొత్తం వేగంగా పెరుగుతుందని నిపుణులు వివరిస్తున్నారు. లెక్కల ప్రకారం.. 30 ఏళ్లలో పెట్టుబడిదారులు మొత్తం మీద కేవలం రూ.36 లక్షలు మాత్రమే పెట్టుబడి పెట్టి ఉంటారు. కానీ దానిపై వచ్చే చక్రవడ్డీ లాభంతో ఆ నిధి రూ.2 కోట్లకు పైగా జమ అవుతుంది. దీనినే "చక్రవడ్డీ శక్తి" అంటారు. మీరు చిన్న మొత్తంతో ప్రారంభించినా కూడా దీర్ఘకాలంలో అపారమైన సంపదను నిర్మించుకోవచ్చని ఆర్థిక సలహాదారులు చెబుతున్నారు. మార్కెట్ హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా క్రమం తప్పకుండా పెట్టుబడులు పెట్టే అవకాశం ఉండటం పెట్టుబడుల మరో ప్రయోజనం. దీనివల్ల దీర్ఘకాలంలో సగటున మంచి రాబడిని పొందే అవకాశాలు పెరుగుతాయి. చిన్న వయస్సులోనే ప్రారంభించడం ద్వారా పదవీ విరమణ భద్రతను, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సులభంగా సాధించవచ్చని నిపుణులు భావిస్తున్నారు. పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టే ముందు తమ ఆదాయం, రిస్క్‌ను తట్టుకోగల సామర్థ్యం, ఆర్థిక లక్ష్యాలను పరిగణనలోకి తీసుకోవాలి. మ్యూచువల్ ఫండ్‌లు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. అందుకే పెట్టుబడి పెట్టే ముందు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. ఎలాంటి పెట్టుబడి పెట్టే ముందు లేదా ఏదైనా ఆర్థికపరమైన రిస్క్ తీసుకునే ముందు ఆర్థిక సలహాదారుని సంప్రదించాలని సూచిస్తున్నాము.)

# ఎమర్జెన్సీ టైమ్‌లో పర్సనల్ లోన్ VS క్రెడిట్ కార్డ్ లోన్ ఏది తీసుకోవాలంటే?




అత్యవసర ఖర్చుల సమయంలో పర్సనల్ లోన్, క్రెడిట్ కార్డ్ లోన్‌లలో ఏది ఎంచుకోవాలో చాలామందికి సందిగ్ధత ఉంటుంది. తక్కువ వడ్డీ, స్థిర జువీ×లతో పర్సనల్ లోన్ సురక్షిత ఎంపికగా నిపుణులు సూచిస్తున్నారు. సమయానికి బకాయిలు చెల్లించకపోతే క్రెడిట్ కార్డ్ రుణాలు భారీ భారం కావచ్చని హెచ్చరిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో డబ్బు అవసరమైనప్పుడు చాలామంది ముందుగా పర్సనల్ లోన్ లేదా క్రెడిట్ కార్డ్ లోన్‌ను ఆశ్రయిస్తారు. అయితే ఈ రెండు రకాల రుణాల మధ్య వడ్డీ రేట్లు, ఛార్జీలు, తిరిగి చెల్లింపు విధానం వంటి అంశాల్లో గణనీయమైన తేడాలు ఉంటాయి. సరైన ఎంపిక చేసుకోకపోతే రుణభారం మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. పర్సనల్ లోన్ అనేది నిర్దిష్ట కాలపరిమితి, స్థిర వడ్డీ రేటుతో ఇచ్చే రుణం. ఇందులో ప్రతి నెలా సమాన జువీ×లను చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు, క్రెడిట్ కార్డ్ లోన్ రివాల్వింగ్ క్రెడిట్ విధానంలో పనిచేస్తుంది. కార్డుకు కేటాయించిన పరిమితి వరకు ఎప్పుడైనా ఖర్చు చేయవచ్చు. అయితే బకాయిని పూర్తిగా చెల్లించకపోతే అధిక వడ్డీ వర్తిస్తుంది. కొన్ని బ్యాంకుల్లో ఈ వడ్డీ రేట్లు నెలకు 1.99 శాతం నుంచి 3.75 శాతం వరకు ఉండగా, వార్షికంగా 55 శాతం వరకు చేరే అవకాశం ఉంది. పర్సనల్ లోన్‌లపై ప్రాసెసింగ్ ఫీజులు, ముందస్తు చెల్లింపు ఛార్జీలు ఉంటాయి. ఉదాహరణకు ఎణఖీజ, ×జ×జ×, ఌఇఅం బ్యాంక్ వంటి బ్యాంకులు రుణ మొత్తంపై 1 నుంచి 5 శాతం వరకు ప్రాసెసింగ్ ఫీజులు వసూలు చేస్తున్నాయి. అయినప్పటికీ వడ్డీ రేట్లు స్థిరంగా ఉండటంతో రుణభారం ముందుగానే అంచనా వేసుకునే అవకాశం ఉంటుంది. క్రెడిట్ కార్డ్ లోన్‌లో మాత్రం సమయానికి చెల్లింపులు చేయకపోతే వడ్డీ చక్రవడ్డీగా పెరుగుతుంది. ఆలస్య చెల్లింపులకు జరిమానాలు కూడా విధిస్తారు. దీంతో చిన్న మొత్తంతో ప్రారంభమైన బకాయి భారీ రుణంగా మారే ప్రమాదం ఉంటుంది. వడ్డీ రేట్ల తగ్గింపుతో పర్సనల్ లోన్‌లు మరింత అందుబాటులోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. అయితే గృహ రుణభారం పెరుగుతున్న నేపథ్యంలో రుణాలు తీసుకునేటప్పుడు జాగ్రత్త అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. వైద్య అత్యవసరాలు, పెద్ద ఖర్చుల కోసం తక్కువ వడ్డీతో స్థిర జువీ×లు ఉండే పర్సనల్ లోన్ సురక్షిత ఎంపికగా పరిగణిస్తున్నారు. అయితే చిన్నకాలంలో బకాయిని పూర్తిగా క్లియర్ చేయగలిగితే మాత్రమే క్రెడిట్ కార్డ్ లోన్ ఉపయోగకరమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

# ఈ దేశంలో చావు కూడా పండగే శవపేటికతో అదిరిపోయే స్టెప్పులు ఈ ఆచారం వెనకున్న అసలు కథ ఇదే..

మరణం అనేది ఎవరికైనా బాధను మిగిల్చే విషయమే, కానీ ఆఖరి ప్రయాణాన్ని విషాదంగా కాకుండా ఒక వేడుకలా సాగనంపాలని అంటోంది పెరూ సంస్కృతి. సోషల్ మీడియాలో గతంలో వైరల్ అయిన ఆఫ్రికన్ ఘనా స్టైల్ డ్యాన్సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని, ఇప్పుడు పెరూ ప్రజలు తమ ప్రియమైన వారికి భిన్నంగా వీడ్కోలు పలుకుతున్నారు.ప్రజల ఆలోచనా విధానంలో వస్తున్న ఈ మార్పుకు కారణాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.. సాధారణంగా ఎవరి ఇంట్లోనైనా మరణం సంభవిస్తే అక్కడ కన్నీళ్లు, తీరని దుఃఖం, నిశబ్దం, విషాద వాతావరణం అలుముకుంటుంది. కానీ దక్షిణ అమెరికా దేశమైన పెరూలో మాత్రం పాత అంత్యక్రియల ఆచారాలను పూర్తిగా మార్చేస్తూ ఒక కొత్త, విలక్షణమైన పోకడ వేగంగా వ్యాపిస్తోంది. సాంప్రదాయ సంతాపానికి, ఏడుపులకు బదులుగా మృతుని అంత్యక్రియల ఊరేగింపును ఒక పండుగలా జరుపుకుంటున్నారు. ఈ క్రమంలోనే అక్కడ డ్యాన్సింగ్ పాల్ బేరర్స్ అనే సరికొత్త భావన విపరీతమైన ప్రాచుర్యం పొందుతోంది. మరణాన్ని కూడా వేడుకలా మార్చేస్తున్న ఈ వింత ఆచారం వెనుక ఉన్న ఆసక్తికరమైన వాస్తవాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.




### కన్నీళ్లకు బదులుగా వీడ్కోలు నృత్యం

పెరూలో వేగంగా విస్తరిస్తున్న ఈ కొత్త సంప్రదాయంలో.. ప్రత్యేకంగా శిక్షణ పొందిన యువకుల బృందం అంత్యక్రియల్లో పాల్గొంటుంది. వీరు మరణించిన వ్యక్తి ఉన్న శవపేటికను తమ భుజాలపై మోస్తూ, పెద్ద శబ్దంతో కూడిన డ్రమ్స్, ట్రంపెట్స్ సంగీతానికి లయబద్ధంగా డ్యాన్స్ చేస్తారు. దీని వెనుక ఒక బలమైన భావోద్వేగ ఉద్దేశ్యం ఉంది. తమను విడిచి వెళ్లిపోయిన ప్రియమైన వారిని కన్నీళ్లతో కాకుండా ఆఖరిసారిగా నవ్వులతో, సంతోషంగా స్మరించుకోవాలనేదే ఈ వింత పద్ధతి ముఖ్య ఉద్దేశం. అంత్యక్రియల సమయంలో మృతుడు తన జీవితకాలంలో ఎక్కువగా ఇష్టపడిన జనాదరణ పొందిన పాటలను ప్లే చేస్తారు. శవపేటికను మోస్తున్న బృందం ఆ పాటల ట్యూన్స్‌కు అనుగుణంగా చాలా జాగ్రత్తగా స్టెప్పులు వేస్తూ స్మశానవాటిక వైపు కదులుతుంది.


### ఆఫ్రికన్ ఘనా శైలి స్ఫూర్తి

కొన్ని సంవత్సరాల క్రితం పశ్చిమ ఆఫ్రికా దేశమైన ఘనాకు చెందిన డాన్సింగ్ పాల్ బేరర్స్ వీడియోలు సోషల్ మీడియాలో ప్రపంచవ్యాప్తంగా ఎంతలా వైరల్ అయ్యాయో అందరికీ తెలిసిందే. ఆ వీడియోలు అప్పట్లో నెట్టింట పెద్ద మీమ్ ట్రెండ్‌గా మారాయి. ఇప్పుడు అదే ఆఫ్రికన్ శైలిని పెరూ ప్రజలు తమ స్థానిక సంస్కృతికి, ఆచారాలకు అనుగుణంగా మార్చుకుని ఫాలో అయిపోతున్నారు. అక్కడ రోజురోజుకూ ఈ ట్రెండ్‌కు ఆదరణ పెరుగుతోంది.


మరణాన్ని వేడుకగా మార్చేస్తున్న ఆధునిక ఆలోచన

పెరూలోని అనేక కుటుంబాలు ఈ సరికొత్త ఆలోచనను హృదయపూర్వకంగా స్వీకరిస్తున్నాయి. "మనకు ఎంతో ప్రియమైనవారు ఈ లోకాన్ని విడిచి వెళ్ళినప్పుడు అక్కడ కేవలం విషాద వాతావరణం మాత్రమే ఉండకూడదు. బదులుగా వారు ఈ భూమిపై పండించిన నవ్వులను, వారు జీవించిన సంపూర్ణ జీవితాన్ని మనం ఒక వేడుకగా జరుపుకోవాలి" అని స్థానికులు బలంగా నమ్ముతున్నారు. నిజానికి ఇలాంటి వేడుకలు కేవలం ఇటీవలి కాలంలో వచ్చిన పోకడ మాత్రమే కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్ని ప్రాచీన గిరిజన సంస్కృతులలో మరణాన్ని ఒక ముగింపులా చూడరు. దాన్ని పరలోకానికి లేదా మరో కొత్త ప్రపంచానికి సాగే ప్రయాణానికి నాందిగా భావించి వేడుక చేసుకునే సంప్రదాయం చరిత్రలో ఎప్పటినుంచో ఉంది. ఇప్పుడు పెరూ దేశంలో అదే పురాతన భావన ఒక ఆధునిక రూపాన్ని సంతరించుకుని ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది.

# ఈ క్రెడిట్ కార్డు ఉంటే చాలు ఉచితంగా 172 లీటర్ల పెట్రోల్..!



బ్యాంకు వెబ్‌సైట్ ప్రకారం.. ఈ అద్భుతమైన క్రెడిట్ కార్డును పొందడానికి మీరు కేవలం రూ.499 జాయినింగ్ ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. రెండవ సంవత్సరం నుండి అదే రూ. 499 వార్షిక రుసుముగా వసూలు చేస్తారు. అయితే మీరు ఒక సంవత్సరంలో..

పెరుగుతున్న పెట్రోల్ ధరల గురించి మీరు ఆందోళన చెందుతున్నారా? అయితే, వాహన ఇంధనం, రోజువారీ గృహ ఖర్చులపై వేల రూపాయలు ఆదా చేసుకునే అద్భుతమైన అవకాశం మీకు లభిస్తే ఎలా ఉంటుంది. ఫస్ట్ పవర్ ప్లస్ క్రెడిట్ కార్డ్ ఈ కలను నిజం చేస్తూ, మార్కెట్‌లో సంచలనం సృష్టిస్తోంది. ఈ రోజుల్లో క్రెడిట్ కార్డ్ ప్రతి ఒక్కరికీ ఒక అవసరంగా మారింది. ఈ ఫస్ట్ పవర్ ప్లస్ కార్డ్, ముఖ్యంగా ఎక్కువగా ప్రయాణించే, షాపింగ్ ప్రియులైన వారికి ఒక అద్భుతమైన వరం.

1 / 6

బ్యాంకు వెబ్‌సైట్ ప్రకారం.. ఈ అద్భుతమైన కార్డును పొందడానికి మీరు కేవలం రూ.499 జాయినింగ్ ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. రెండవ సంవత్సరం నుండి అదే రూ. 499 వార్షిక రుసుముగా వసూలు చేస్తారు. అయితే మీరు ఒక సంవత్సరంలో రూ. 1,50,000 లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు చేస్తే ఈ వార్షిక రుసుము పూర్తిగా మాఫీ చేస్తారు. అందువల్ల వినియోగదారులు ఈ కార్డును దాదాపు ఉచితంగా ఉపయోగించుకునే గొప్ప ప్రయోజనాన్ని పొందుతారు.

2 / 6

కార్డు జారీ అయిన వెంటనే కొత్త కస్టమర్లకు రూ.2500 విలువైన స్వాగత ప్రయోజనాలు లభిస్తాయి. దీనిలో భాగంగా మీరు ౖూజూ బ్యాంకులలో మొదటిసారిగా రూ.500 ఖర్చు చేస్తే మీకు వెంటనే రూ.500 విలువైన గిఫ్ట్ వోచర్ లభిస్తుంది. అలాగే మొదటి మార్పిడి లావాదేవీపై గరిష్టంగా రూ.1000 వరకు 5 శాతం క్యాష్‌బ్యాక్ పొందుతారు. దీనికి అదనంగా మీకు రూ.1000 విలువైన మర్చంట్ ఆఫర్లు కూడా లభిస్తాయి.

3 / 6

ఈ కార్డు రోజువారీ ఖర్చులపై అందించే ఆదా అసాధారణమైనది. ఇది ప్రధానంగా ఇంధన ఖర్చులపై 6.5 శాతం భారీ ఆదాను అందిస్తుంది. దీనికి అదనంగా కిరాణా, రోజువారీ యుటిలిటీ బిల్లుల చెల్లింపులపై 5 శాతం రివార్డులను అందిస్తుంది. ఈ చిన్న ఖర్చులతోనే ఏటా వేల రూపాయలను సులభంగా ఆదా చేయవచ్చు. తరచుగా ప్రయాణించే వారికి ఈ కార్డ్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఫస్ట్ మొబైల్ యాప్ ద్వారా చేసే ఫ్లైట్, హోటల్ బుకింగ్‌లపై మీరు 8.83 శాతం భారీ తగ్గింపును పొందవచ్చు. అదనంగా ఫస్ట్ ఫాస్టాగ్ రీఛార్జ్‌పై మీరు 5 శాతం ఆదా చేసుకోవచ్చు. ఈ కార్డ్ ప్రత్యేకత ఏమిటంటే ఇది లావాదేవీలు, ఇతర రిటైల్ ఖర్చులపై 3 రెట్లు రివార్డ్ పాయింట్లను అందిస్తుంది.

4 / 6

ఈ కార్డు ఆర్థిక సౌలభ్యం విషయంలో అనేక వినూత్న సేవలను అందిస్తుంది. మీరు అత్యవసర పరిస్థితుల్లో ఏటీఎంల నుండి డబ్బు విత్‌డ్రా చేస్తే గడువు తేదీ వరకు సున్నా శాతం వడ్డీ వర్తిస్తుంది. అంటే మీరు ఎలాంటి అదనపు భారం లేకుండా ఆ డబ్బును ఉపయోగించుకోవచ్చు. అంతేకాకుండా దీనిపై వసూలు చేసే వడ్డీ రేట్లు సంవత్సరానికి 8.5 శాతం అనే తక్కువ రేటు నుండి ప్రారంభమవుతాయి. క్యాష్‌బ్యాక్‌లతో పాటు ఈ కార్డు అనేక ఇతర ప్రయోజనాలను అందిస్తుంది. ప్రతి నెలా కనీసం రూ. 20,000 ఖర్చు చేస్తే, త్రైమాసికానికి ఒకసారి దేశీయ విమానాశ్రయ లాంజ్‌లలోకి ఉచిత ప్రవేశం లభిస్తుంది. ప్రతి నెలా రూ. 1,399 విలువైన రోడ్‌సైడ్ సహాయం, సినిమా టిక్కెట్లపై 25 శాతం తగ్గింపు (రూ.100 వరకు) కూడా ఉచితంగా లభిస్తాయి. రూ.2,00,000 వ్యక్తిగత ప్రమాద బీమా ఉచితంగా అందిస్తారు.

5 / 6

మీరు మీ ఖర్చులను తెలివిగా ప్లాన్ చేసుకుంటే ఈ కార్డుతో సంవత్సరానికి రూ. 18,918 ఆదా చేసుకోవచ్చు. దీన్ని లెక్కలోకి తీసుకుంటే ఇది 172 లీటర్లకు పైగా ఉచిత పెట్రోల్ పొందినట్లే (రూ. 110 పెట్రోల్ ధర ఆధారంగా). మీరు ఒక స్నేహితుడిని రిఫర్ చేస్తే, మీకు అదనంగా 10,000 రివార్డ్ పాయింట్లు కూడా లభిస్తాయి. తక్కువ వడ్డీ రేట్లు, అనేక ఆకర్షణీయమైన ప్రయోజనాలతో ఈ ఫస్ట్ పవర్ ప్లస్ కార్డ్ నిజంగా ప్రతి ఒక్కరి దగ్గర ఉండవలసిన ఒక గొప్ప ఆర్థిక ఆయుధం.

# ప్రతి నెలా బంగారంలో పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారా? ఇవి తప్పకుండా తెలుసుకోండి..!




బంగారంలో పెట్టుబడి పెట్టేటప్పుడు మీరు సౌలభ్యం మాత్రమే కాకుండా భద్రత, ద్రవ్యత, పన్నులు, నియంత్రణ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సరైన ఎంపిక దీర్ఘకాలంలో మెరుగైన రాబడికి, సురక్షితమైన పెట్టుబడికి దారితీస్తుంది. ఒకవేళ పెట్టుబడిదారుడు క్రమం తప్పకుండా.. భారతీయ పెట్టుబడిదారులకు బంగారంలో పెట్టుబడి పెట్టడం ఎల్లప్పుడూ ఒక ప్రధాన ఎంపికగా ఉంది. మారుతున్న కాలంతో పాటు బంగారంలో పెట్టుబడి పెట్టే పద్ధతులు కూడా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. గతంలో ప్రజలు కేవలం ఆభరణాలు, నాణేలు లేదా బిస్కెట్లు మాత్రమే కొనుగోలు చేసేవారు. కానీ ఇప్పుడు పెట్టుబడిదారులకు గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్ (ఈజీఆర్), డిజిటల్ గోల్డ్ వంటి అనేక రకాల ఆధునిక ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా యువ జీతభత్యాలు పొందే పెట్టుబడిదారులలో తమ నెలవారీ పొదుపును భద్రత, రాబడి రెండింటినీ అందించే ఎంపికలో పెట్టుబడి పెట్టాలనే ప్రశ్న వేగంగా పెరుగుతోంది. బంగారంలో పెట్టుబడి పెట్టడం సురక్షితమైన ఎంపిక మాత్రమే కాదు. ఇది పోర్ట్‌ఫోలియో డైవర్సిటీకి ఒక బలమైన సాధనంగా కూడా మారింది. అయితే ప్రతి ఎంపికకు దాని స్వంత ప్రత్యేక ప్రయోజనాలు, నష్టాలు ఉన్నందున సరైన పెట్టుబడి పద్ధతిని ఎంచుకోవడం చాలా కీలకం.

### గోల్డ్ ఈటీఎఫ్‌లు అంటే ఏమిటి?

గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్‌లు, మ్యూచువల్ ఫండ్‌లు, స్టాక్ మార్కెట్ కలయికగా పరిగణిస్తారు. ఈ ఫండ్‌లు దేశీయ మార్కెట్‌లోని బంగారం ధరను ట్రాక్ చేస్తూ, షేర్ల లాగా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో ట్రేడ్ అవుతాయి. పెట్టుబడిదారులు తమ ట్రేడింగ్, డీమ్యాట్ ఖాతాల ద్వారా వీటిలో పెట్టుబడి పెట్టవచ్చు. గోల్డ్ ఈటీఎఫ్‌ల అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే వీటికి భౌతిక బంగారు నిల్వలు అవసరం లేదు. దీనివల్ల దొంగతనం, నిల్వ, స్వచ్ఛత వంటి సమస్యలు తొలగిపోతాయి. అంతేకాకుండా చిన్న నెలవారీ పెట్టుబడులు పెట్టడం సాధ్యమవుతుంది. ఇది జీతం పొందే వర్గంలో ఈ ఎంపికను మరింత ప్రాచుర్యం పొందేలా చేస్తోంది.

### ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీప్ట్ అంటే ఏమిటి?

ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీప్ట్ అనేది డీమ్యాట్ ఖాతాలో డిజిటల్‌గా ఉంచిన ఒక ఎక్స్ఛేంజ్ ఆధారిత సెక్యూరిటీ. పెట్టుబడిదారుల బంగారంపై యాజమాన్య హక్కులు డిజిటల్‌గా నమోదు అవుతాయి. అయితే అసలు బంగారం ౧జుదీ×-ఆమోదిత ఖజానాలలో సురక్షితంగా నిల్వ ఉంటాయి. దీని అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే, పెట్టుబడిదారులు కోరుకుంటే దానిని తర్వాత భౌతిక బంగారంగా మార్చుకోవచ్చు. ఎన్ఎస్ఈ ఇటీవల దీనిని వివిధ డినామినేషన్లలో ప్రారంభించింది. అయితే, వాల్టింగ్, నిల్వ ఛార్జీలు కూడా అవసరం. దీనివల్ల ఖర్చు పెరగవచ్చు. అంతేకాకుండా తక్కువ ట్రేడింగ్ వాల్యూమ్‌ల కారణంగా లిక్విడిటీ సమస్యలు తలెత్తవచ్చు.

### డిజిటల్ గోల్డ్ ఎంత సురక్షితమైనది?

డిజిటల్ బంగారం ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోంది. పెట్టుబడిదారులు పేటీఎం, ఫోన్‌పే వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో బంగారాన్ని కొనుగోలు చేయవచ్చు. కేవలం రూ.10తో కూడా పెట్టుబడిని ప్రారంభించవచ్చు. అంతేకాకుండా అవసరమైతే డిజిటల్ బ్యాలెన్స్‌లను భౌతిక బంగారంగా మార్చుకోవచ్చు. అయితే డిజిటల్ బంగారం విషయంలో అతిపెద్ద ఆందోళన దాని నియంత్రణ పరిమితులే. ఇది సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (౧జుదీ×) లేదా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) చేత పూర్తిగా నియంత్రణ ఉండదు. అంతేకాకుండా ఇందులో జీఎస్టీ, కొనుగోలు, అమ్మకాల మధ్య అధిక వ్యత్యాసం ఉంటాయి. పన్నుల పరంగా కూడా ఇతర ఎంపికలతో పోలిస్తే ఇది తక్కువ ఆకర్షణీయంగా పరిగణిస్తారు.

### జీతం తీసుకునే పెట్టుబడిదారులకు ఏ ఎంపిక మంచిది?

ఒకవేళ పెట్టుబడిదారుడు క్రమం తప్పకుండా నెలవారీ పెట్టుబడులు పెట్టాలనుకుంటూ సురక్షితమైన, పారదర్శకమైన, సులభంగా ట్రేడ్ చేయగల ఎంపిక కోసం చూస్తున్నట్లయితే గోల్డ్ ఈటీఎఫ్ ఉత్తమ ఎంపిక కావచ్చు. ఇది సెబీచే నియంత్రణ ఉంటుంది. పన్నుల విధానం కూడా చాలా సరళంగా ఉంటుంది. భవిష్యత్తులో భౌతిక బంగారాన్ని కొనుగోలు చేయాలనుకునే పెట్టుబడిదారులకు ఈజీఆర్ (జు+=) మరింత అనుకూలంగా ఉండవచ్చు.